# తెలుగు వెలుగు

**- డాక్టర్ కడియాల రామమోహనరాయ్**

శ్రీ మొదలి నాగభూషణశర్మ నాటక రచయిత, నటుడు, దర్శకుడు, నాటక విమర్శకుడు, పరిశోధకుడు, నటశిక్షకుడు, తెలుగునాట నాటకోద్యమానికి తోడ్పడిన నాటకరంగ ప్రముఖుడు.

అర్ధశతాబ్దికి పైబడిన కాలంలో తెలుగు నాటకరంగ చరిత్ర నాగభూషణశర్మగారి నాటకరంగ కృషితో ముడిపడివున్నది. ఎనిమిదవ ఏటనే తండ్రిగారి ప్రోత్సాహంతో నటునిగా నాటకరంగంలో ప్రవేశించారు. రాముని బుద్ధిమంతనం (శరత్‌బాబు రచన) లో నటించారు (1951).

చిన్నవయసులోనే శర్మగారు రచించిన 'అన్వేషణ' నాటిక సుప్రసిద్ధ సాహిత్యమాసపత్రిక 'భారతి'లో ప్రచురితమైంది. తరువాత 'జంటపక్షులు' (భారతి) 'అడ్డదారి' (ఆంధ్రప్రభ) నాటికలు వీరికి నాటక రచయితగా గుర్తింపు తెచ్చిపెట్టాయి.

1955 నుండి విజయవాడ, హైదరాబాదు రేడియో కేంద్రాలు వీరి నాటికలను ప్రసారం చేశాయి. సుప్రసిద్ధ రచయిత బుచ్చిబాబు, ప్రఖ్యాత కవి దాశరథి ఆకాశవాణి అధికారులుగా వీరి నాటక రచనలను ప్రోత్సహించారు.

తొలిదశలో శర్మగారు నాటకరచన చేస్తున్న కాలంలో ప్రఖ్యాత నాటకరచయిత, ప్రయోక్త కొప్పరపు సుబ్బారావు నాటకరచనలో కొన్ని మెలకువలను సూచించి మార్గదర్శకులైనారు.

ఇంగ్లీషు సాహిత్యాన్ని మక్కువతో అధ్యయనం చేసిన శర్మగారు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా పనిచేశారు.

నాగభూషణశర్మగారి వీలునామా (1955), 'కల-కాపురం' (1955-56), 'అడ్డదారి' (1958) నాటికలు ఏభైయేళ్ల తర్వాతగూడ చదివి ఆనందించ నాటక సమాజాలు తిరిగి ప్రదర్శించదగినవి.

'అమెరికా నాటకరంగం' పై పరిశోధన చేసిన శర్మగారు అమెరికాలో పెక్కు ఇంగ్లీషు నాటకాలు, నాటికలు చూశారు. నాటకరంగ ప్రయోగంలో మెలకువలను ఆకళించుకున్నారు. 'బియాండ్ ది హొరైజన్; 'హెయిరీ ఏప్', 'డిజైర్ అండర్ ది ఎల్మ్‌స్', 'స్ట్రేంజ్ ఇంటర్లూడ్ (యూజిన్ ఓనీల్), 'ఎ స్ట్రీట్‌కార్ నేమ్డ్ డిజైర్', 'కేట్ ఆన్ హాట్‌టిన్‌రూఫ్', 'ది మిల్క్ ట్రెయిన్ డజన్ట్ స్టాప్ హియర్ (టెనెస్సి విలియమ్), 'ది డెత్ ఆఫ్ ఎ సేల్స్‌మాన్ (అర్థర్ మిల్లర్) నాటకాలలోని వివిధ జీవితకోణాలను పరిశీలించారు. ఆధునిక తెలుగునాటక వికాసానికి విశ్వవిఖ్యాత నాటకాల నుండి ప్రేరణ పొందవలసిన అవసరాన్ని గుర్తించారు.

USA - Wisconsin - Illinois విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థిగా వున్నప్పుడు నాటకానికి దర్శకత్వం వహించారు. పిక్‌నిక్ ఆన్ ది బేటిల్‌ఫీల్డ్ నాటకానికి సహాయ దర్శకులుగా వున్నారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం తొలిసారిగా నాటక విభాగాన్ని ప్రారంభించినపుడు ఆ శాఖకు శర్మగారు తొలి ఆచార్యులై తెలుగు నాటక వికాసానికి విశేషమైన కృషిచేశారు.

ఇంకా 'యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్', 'పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ' నాటక విభాగాలలో ఆచార్యునిగా, నటశిక్షకునిగా, ఉత్తమ నాటకప్రయోక్తగా తెలుగు నాటకరంగ అభివృద్ధికి తోడ్పడ్డారు.

'మన్మథుడు మళ్ళీ పుట్టాడు', 'మదనకామరాజు కథ', 'ప్రజానాయకుడు ప్రకాశం' శర్మగారికి పేరుతెచ్చిపెట్టిన నాటకాలు.

'మన్మథుడు మళ్ళీ పుట్టాడు' అశ్లీలానికి, అసభ్యతకు దూరంగా, ఉల్లాసంగా, హాస్యభరితంగా వుంటుంది. 'మదనకామరాజుకథ'ను శర్మగారు స్వయంగా చదివి వినిపించినపుడు విని ఆనందించాను.

విలువలు దిగజారిన జమీందారీ జీవనవిధానం ఇందులో వున్నది. ఏ అమ్మాయి కనిపించినా, అంచెలంచెలుగా ప్రేమించి జమీందారు రామరాజు తన అవకతవక చేష్టలతో ప్రేక్షకులను వినోదింపజేస్తాడు.

"పక్కచూపులు, తొంగి చూపడాలు, ప్రేమకలాపాలు సాగించడం, రెండర్థాల మాటలు, ప్రమాదం ముంచుకువస్తే ఏ మంచం కిందనో దాక్కోవడం, ఇవేమీ కుదరకపోతే బుకాయించటం. ఇవన్నీ ఇటువంటి మగధీరుల శృంగారజీవితాల్లో కనిపించే ఆటుపోట్లు – వీటికి సుతారంగా అద్దంపడుతూ సునిశితంగా మందలిస్తూ ఆసాంతమూ హాస్యభరితంగా సాగిపోతుంది మదనకామరాజు కథ." (గరిమెళ్ళ రామమూర్తి)

నాగభూషణశర్మగారి పేరు వినగానే చాలమందికి జ్ఞాపకం వచ్చే నాటకం 'ప్రజానాయకుడు ప్రకాశం'. చాల పట్టణాలలో, నగరాలలో 30కి పైగా యీ నాటకప్రదర్శనలు జరిగాయి. ప్రముఖ నటులు కీ.శే. చాట్ల శ్రీరాములు ఆంధ్రకేసరి ప్రకాశంపంతులు పాత్రలో జీవించారు.

'ఆంధ్రకేసరి' ప్రకాశంపంతులుగారి స్వీయచరిత్ర 'నా జీవితయాత్ర' యీ నాటకరచనకు ప్రాతిపదిక. యథార్థ విషయాలను ఎక్కడా వక్రీకరించకుండ ప్రకాశంగారి జీవిత సంఘటనలకు శర్మగారు చాకచక్యంగా, నాటకరూపమిచ్చారు. ప్రజాసేవకుడు, దేశభక్తుడు ప్రకాశంగారి త్యాగమయ జీవితాన్ని, ధీరత్వాన్ని చూసిన అనుభూతి యీ నాటకం చూసిన తర్వాత తప్పక కలుగుతుంది.

ఇప్పుడీ నాటకాన్ని ప్రదర్శించాలంటే ఒక పెద్ద చిక్కు ఎదురవుతుంది. అదేమంటే ప్రకాశంగారి పాత్రకు మహానటుడు చాట్ల శ్రీరాములుగారిలాంటి నటుడు లభించటం.

సమకాలిక భారతీయ నాటకాలను, ప్రపంచ ప్రసిద్ధమైన ఇంగ్లీషు నాటకాలను తెనిగించి, వాటికి దర్శకత్వం వహించి, విశ్వవిద్యాలయాల థియేటర్ ఆర్ట్స్ వారిచేత ప్రదర్శింపజేయటం నాగభూషణశర్మగారు సాధించిన ఘనవిజయం.

'అంధయుగం' – ధర్మవీర్‌భారతి హిందీ రచనను తెనిగించటంలో నాగభూషణశర్మగారి శ్రీమతి సహకారం వున్నది. 'నిశ్శబ్దం కోర్టు నడుస్తోంది' (విజయ్ తెండూల్కర్) హయవదన – 'తుగ్లక్' (గిరీశ్ కర్నాడ్), 'చల్‌చల్ గుర్రం' (చంద్రశేఖర కంబార), 'మృచ్ఛకటిక' (శూద్రకుని రచనకు ఇంగ్లీషు అనువాదం), 'రాజా ఈడిపస్' (సోఫోక్లిజ్) వీరు విశ్వవిద్యాలయాలలో ప్రదర్శించిన నాటకాలు.

ఆచార్య ఆత్రేయ నాటకాలను శర్మగారు క్షుణ్ణంగా అధ్యయనం చేయటమేగాక 'విశ్వశాంతి' నాటకాన్ని ప్రదర్శించి ప్రశంసలు పొందారు.

'నాటకశిల్పం', వ్యాససంపుటులు ప్రాచీన, ఆధునిక నాటకాలపై ఆలోచింపజేసే అభిప్రాయ మాలికలు.

శ్రమకోర్చి శర్మగారు సమకూర్చిన 'నాటక పరిభాష' నాటకాభిమానులకు ఉపయోగకరమైనది.

తెలుగు నవల శతజయంతి సందర్భంగా శర్మగారు రచించిన 'తెలుగు నవలా వికాసం; ఇంకా 'తెలుగు సాహిత్యం – గాంధీజీ ప్రభావం' విలువైన సాహిత్య విమర్శ గ్రంథాలు.

శర్మగారు రచించిన గొప్పనాటకం 'ప్రజానాయకుడు ప్రకాశం', అనువదించిన గొప్పనాటకం 'అంధయుగం' గురించి మరికొంచెం విపులీకరిస్తాను.

**ప్రజానాయకుడు ప్రకాశం**

సమకాలికులైన మహావ్యక్తుల జీవిత విశేషాలను నాటకాలుగా ప్రదర్శించి మెప్పించటం చాల కష్టం. వీటిలో కల్పనలకు అవకాశం ఉండదు. అభూత కల్పనలను ప్రేక్షకులు ఆదరించరు.

నూటయాభై సంవత్సరాల ఘనచరిత్రగల ఆంధ్ర నాటకచరిత్రలో తెలుగుజాతి మహావీరులు అల్లూరి సీతారామరాజు, టంగుటూరి ప్రకాశం పంతులు – ఇద్దరిపైననే నాటకాలు వచ్చాయి. భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న మహానాయకులపై తెలుగులో వచ్చిన నాటకాలు గూడ తక్కువే. గాంధీజీ, తిలక్, మహాత్మా పూలే, అంబేద్కర్‌లపై కొన్ని నాటకాలు వచ్చాయి.

భక్తరామదాసు, త్యాగరాజుల పై వచ్చిన నాటకాలలో తరతరాలుగా వాళ్లను గూర్చి వినవస్తున్న కథలను నమ్మి తెలుగు నాటక రచయితలు ఆ మహావ్యక్తులకు మహిమలను ఆపాదించారు.

శ్రీ మొదలి నాగభూషణశర్మ నాటక ప్రయోక్తగా, రచయితగా, నటునిగా, నట శిక్షణనిచ్చే ఆచార్యునిగా అర్ధశతాబ్దకాలం తెలుగు నాటకరంగానికి సేవలందించిన ఘనాపాఠి. నాటకరచనలో, ప్రదర్శనలో గొప్ప కళాకారునిగా పేరొందిన నాగభూషణశర్మ 'ప్రజానాయకుడు ప్రకాశం' నాటకం రచించి ఆంధ్రప్రదేశ్‌లోనే గాక న్యూఢిల్లీ వంటి ప్రాంతాలలో గూడ ప్రదర్శించి ప్రేక్షకుల, విమర్శకుల ప్రశంసల నందుకున్నారు.

ప్రకాశంపంతులుగారి 'నా జీవితయాత్ర'లో ఘట్టాలను నాటకంలో ప్రధాన సన్నివేశాలుగా రూపొందించారు. ఇది డాక్యుమెంటరీ డ్రామా కాదు. చారిత్రక నాటకం.

ఒక మామూలు మనిషి మహామనీషి కావటం ఈ నాటకంలో కన్పిస్తుంది.

1948లో ప్రకాశం మద్రాసు రాష్ట్ర ప్రధాని అయ్యారు. ఆయన్ను పదవీచ్యుతుణ్ణి చేయటానికి రాజాజీ వర్గం ప్రయత్నించింది.

పదకొండు నెలల్లో ప్రకాశం మంత్రివర్గం పడిపోయింది. ప్రజాస్వామ్యం హత్య చేయబడింది.

చెన్నపట్టణంలేని ఆంధ్ర రాష్ట్రాన్ని ప్రకాశం కోరలేదు. పొట్టి శ్రీరాములుగారి బలిదానంతో రాష్ట్ర విభజన తప్పనిసరి అయింది.

కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పాటైంది. ప్రకాశం ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు. పదమూడు నెలలు మాత్రమే పదవిలో ఉన్నారు. కొందరు విభీషణాయిల (ఈ పదాన్ని మొదట ప్రకాశంగారే ఉపయోగించారు) కుట్ర ఫలితంగా ఆయన ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం నెగ్గింది.

కాంగ్రెస్‌ను వీడి ప్రకాశం తన అనుయాయులతో 'ప్రజాపార్టీ' స్థాపించారు.

1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడినప్పుడు ప్రకాశం ఏ పదవిలోనూ లేరు. తెలుగువాడి గుండెల్లో పదిలంగా ఉన్నారు.

నాగభూషణశర్మగారి 'ప్రజానాయకుడు ప్రకాశం' నాటకానికి ప్రకాశం పాత్ర ధరించిన సుప్రసిద్ధ నటులు, దర్శకులు చాట్ల శ్రీరాములు గుండెకాయ. ఇంకా ఈ నాటకంలో బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి, దుగ్గిరాల సోమేశ్వరరావు, గరిమెళ్ల రామమూర్తి, జి.బి. రామకృష్ణశాస్త్రి, గుంటూరు శాస్త్రి వివిధ పాత్రలు పోషించి నాటకం రక్తికట్టటానికి తోడ్పడ్డారు. రెండు సంవత్సరాలపాటు పెక్కుచోట్ల ప్రదర్శితమై ఈ నాటకం ప్రశంసలనందుకొన్నది.

మహాకవులు జాషువా, గడియారం వేంకటశేషశాస్త్రి, గరిమెళ్ల, బసవరాజు అప్పారావు గారల పద్యాలు, పాటలు నాటక విజయానికి తోడ్పడ్డాయి.

తెలుగులో వచ్చిన ఉత్తమ నాటకాలలో 'ప్రజా నాయకుడు ప్రకాశం' ప్రముఖంగా పరిగణింపదగినది.

**అంధయుగం**

సుప్రసిద్ధ కవి, రచయిత ధర్మవీర్ భారతి 'అంధయుగం' ఆధునిక భారత చరిత్రలో ఓ విశిష్టమైన స్థానాన్ని పొందిన గేయకవితా నాటకం. గత యాభై ఏళ్ల నాటక చరిత్రలో వచ్చిన గొప్ప నాటకాలలో ప్రప్రథమంగా నిలిచే నాటకం. ఈ నాటక ప్రదర్శన దర్శకత్వ ప్రతిభకు గీటురాయి.

ధర్మవీర్ భారతి 'అంధాయుగ్' ను రేడియో కోసం మొదట నాటికగా రాశారు. శ్రీ సత్యదేవ్ దూబె ఈ నాటికను విని ఆశ్చర్యానందాలను పొంది, దీన్ని సర్వాంగసుందరమైన నాటకంగా రూపొందించమని ధర్మవీర్‌ను కోరారు. ఆయన 'అంధాయుగ్'ను నాటకంగా రచించిన తర్వాత, అది భారతీయ నాటకచరిత్రలోనే గొప్ప నాటకం కాగలదని సత్యదేవ్ గ్రహించారు. ఉత్తమ నాటక దర్శకునిగా అందరి మన్ననలు పొందుతున్న ఇబ్రహీమ్ అల్కాజీకి 'అంధాయుగ్' ను పరిశీలించి ప్రదర్శించవలసిందిగా కోరుతూ బొంబాయి నుండి ఢిల్లీకి పంపించారు.

అల్కాజీ అప్పుడు 'నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా'కు డైరెక్టర్‌గా ఆధునిక భారతీయ నాటక ప్రదర్శనకు రూపురేఖలుదిద్దే పనిలో వున్నారు. ఆయన 'అంధాయుగ్' గొప్పతనాన్ని గుర్తించి తన శక్తియుక్తులతో, ప్రతిభాపాటవాలతో దాన్నొక కళాఖండంగా తీర్చిదిద్దారు.

మహాభారత కథ భారతీయులందరికి ప్రీతిపాత్రమైనది. మహాభారత గాథలోని 18వ రోజు యుద్ధానంతర వాతావరణాన్ని స్వీకరించి, అధునాతన రాజకీయ, సామాజిక స్థితిగతులకు అన్వయించి, దానికి రచయిత తాత్త్విక వివేచనను జోడించారు.

పాండవులను, కౌరవులను అంధులుగా, పాషండులుగా తెల్పటంతో నాటిక కథాస్వరూపం ప్రేక్షకులకు బోధపడుతుంది. "ఇది అంధుల ద్వారా చెప్పే దివ్యజ్యోతి గాథ" అని కవి హెచ్చరించారు.

'దేశం సర్వనాశనం కావటానికి కౌరవ పాండవులిరువురూ కారకులే - కాకుంటే కౌరవులొకపాలెక్కువ' అంటున్నాడు కథకుడు.

"అంధాయుగ్' నాటకాన్ని 1962 లో ఇబ్రహీమ్ అల్కాజీ మహోన్నతంగా ప్రదర్శించిన తర్వాత సత్యదేవ్ దూబే, భానుభారతి (డైరెక్టర్, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా) వేర్వేరు వ్యాఖ్యానాలతో "ఇంప్రవైజేషన్స్'తో మహాద్భుతంగా ప్రదర్శించారు.

ఫిరోజ్‌కోట్లా మైదానం (ఢిల్లీ)లో రథాలు, గుఱ్ఱాలు, రాజసభాభవనాలతో అంధాయుగ్'ను ప్రదర్శించి ఈ నాటక ఔన్నత్యాన్ని ప్రపంచానికి తెలియజెప్పారు ప్రయోక్తలు.

కవి ధర్మవీర్ భారతి 'అంధాయుగ్'లో ప్రవచించిన తత్త్వం (కథాగానం) మహోన్నతమైనది. కవి హృదయం గాంధారి పాత్రలో వ్యక్తమైనట్లనిపిస్తుంది.

కేవలం 14 పాత్రలతో మహాభారత కథను ఉత్కంఠభరితంగా నడిపిన దర్శకుని ప్రజ్ఞ కొనియాడదగినది.

'మృచ్ఛకటికం', 'ముద్రారాక్షసం' నాటకాలలాగ భారతదేశం గర్వించదగిన నాటకం 'అంధాయుగ్'. ఇంత గొప్ప నాటకం తెలుగులోకి రావటానికి 40 సంవత్సరాలు పట్టటం ఆశ్చర్యం.

ఆలస్యంగానైనా తెలుగులోకి తెచ్చిన శ్రీమతి మొదలి సరస్వతి, నాగభూషణ శర్మల కృషి కొనియాడదగినది.

శ్రీరామగోపాల్ బజాజ్ దర్శకత్వంలో, రూపకల్పనలో సరోజినీనాయుడు స్కూల్ ఆఫ్ పర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ వారు వరుసగా 5 రోజులపాటు 'అంధయుగం' విజయవంతంగా ప్రదర్శించి (2003) ప్రశంసలనందుకున్నారు.

'రసరంజని' (హైదరాబాద్) వారు కేశవ మెమోరియల్ స్కూల్లో భారీ ప్రదర్శనతో రసజ్ఞుల మెప్పు పొందారు.

అంధయుగం ఆంధ్రలో, తెలంగాణలో ఊరూరా ప్రదర్శించదగిన ఉత్తమ నాటకం. ఇందుకు ఆయా ప్రభుత్వాలు, నాటక అకాడెమీలు పూనుకోవాలి.

శ్రీ మొదలి నాగభూషణశర్మగారికి అప్పాజోస్యుల - విష్ణుభొట్ల - కందాళం ఫౌండేషన్‌వారి ప్రతిభా పురస్కారం తగినవ్యక్తికి తగిన గౌరవం.

తెలుగు నాటకరంగంలో శర్మగారి కృషిని గుర్తించి భారతప్రభుత్వం 'పద్మభూషణ్' సత్కారంతో గౌరవించటం సముచితంగా వుంటుంది.